# హేతువాది

"నాన్న పోయారు...." ఫోనులో ప్రభునారాయణ. వాడికింక నోరు పెగలలేదు. ఏడుపు ఆపుకోటానికి ప్రయత్నం చేస్తున్నాడేమో.

"నేను వస్తున్నాను. వచ్చాక అన్నీ నేను చూసుకుంటాను. నువ్వు గాబరాపడక. నీకు నీ చదువు, నౌకరీ ఏమో గానీ ఏమీ తెలిసి ఏడవ్వు" అని చెప్పాను మేనల్లుడికి.

నా కనిపించింది, ఆయనకి ఈ కర్మకాండలూ వగైరా అవసరమా అని. హేతువాది కదా? తనెప్పుడూ తన తల్లిదండ్రులకు శ్రాద్ధాలు పెట్టినవాడు కాదు. "ఇవన్నీ వట్టి దండగ! ఆ పోయిన మనిషికి చెందుతయ్యా?" అనేవాడు శంకరనానాయణ. విచిత్రంగా మా చెల్లెలు, మాణిక్యాంబ పోయినప్పుడు చిన్నవాడిచేత కర్మ చేయించాడు. నేనేదయినా ప్రశ్నిస్తానేమో నన్నట్లు, "మనకు నమ్మకాలు లేకపోయినా, ఆమెకున్నాయిగా?" అన్నాడు. 'నాకు నమ్మకాలు లేకపోవటమేం లేదు. నీ నమ్మకాలు నాకు అంత గట్టకయ్యా!' అని అందామనుకుని కూడ మానుకున్నాను.

ఆమెరికానుండయినా రావటం తేలికే గానీ, ఈ పండగల సీజనులో బందరునుండి రావటం కష్టం! నేను, నానా తంటాలు పడి మర్నాటి ఉదయానికిగానీ హైదరాబాదు చేరుకోలేకపోయాను. నేను వచ్చేటప్పటికి, ప్రభుతో ఎవరో మాట్లాడుతున్నారు. "మీ నాన్నగారు నాకు బాగా తెల్సు. గొప్ప మనిషి! నా కింత అన్నం పెట్టినవాడు. నేను పురోహితుడిని. నా పేరు రామనరుసు. ఆయన అంత్యక్రియలు నేను చేయిస్తాను. అందుకు మీరు నాకు డబ్బు ఇవ్వాల్సిన అవసరం లేదు" అంటున్నాడా పెద్ద మనిషి.

నేను అతని వంక విచిత్రంగా చూశాను. వచ్చిన వ్యక్తి వయసు సుమారుగా డెబ్భైయేళ్ళపైబడిఉంటుంది.

ఆ పరిస్థితిలో ఏం చెయ్యాలో తెలియని ఉద్విగ్న స్థితిలో ఉండి పోయాడు ప్రభు. వాడికి తన తండ్రి సంగతి తెల్సు. అతడు తనకు లాభం లేదనిపిస్తే, పిల్లికి బిచ్చం వేయడు. 'ఈయనకు తన తండ్రేమో సాయం చేశాడట!' అని విస్తుపోయినట్లున్నాడు.

"ఆయన మీకు ఏం సాయం చేశాడు?" అని అడిగాను, నేను కల్పించుకుంటూ.

"ఈయన మా మేనమామ రామమూర్తిగారు" అని చెప్పాడాయనకు ప్రభు.

"నాకు తెల్సు మీరు! నన్ను మర్చిపోయి ఉంటారు! ఏళ్ళు గడచిపోయాయి కదా?" అని నవ్వాడు రామనరసు, నా వంక చూసి.

ఆ నవ్వే అతడిని నాకు పట్టి ఇచ్చింది.

చాలకాలం క్రితం జరిగిన సంఘటన గుర్తుకు వచ్చింది నాకు. తనప్పుడు చెల్లెల్ని చూద్దామని హైదరాబాదు వచ్చాడు. పొద్దున ఏడు గంటలయిందేమో, బావ శంకరనారాయణ ఎవర్నో కసురుకోవటం వినపడింది తనకు.

"మీకెన్ని సార్లు చెప్పాను, మా ఇంటికి రావద్దని. అయినా మీరు మీ ప్రవర్తన మార్చుకోరు. వెళ్ళండి. మళ్ళీ మీరు నా కొంపలో అడుగు పెట్టాల్సిన పని లేదు. గెటవుట్....!" అతడేదో అన్నాడు. ఆ పిమ్మట ఏకవచనంలోకి బదిలీ అయింది బావగారి కోపం. "నీకెప్పుడో చెప్పాను. నువ్వా సంగతి మర్చిపోమని. నాకు తెల్సు, ఆపేరు పెట్టుకుని డబ్బు గుంజటానికి వచ్చావు!" అని అరుస్తున్నాడాయన.

అతనేదో చెప్తున్నాడు, నాకు సరిగా వినపడలేదు. అయితే, అతని మాటలు విన్పించుకో లేదు తన బావగారు.ఏవేవో కూశాడు. "నువ్వు భ్రష్టుడివి! కొట్లో గుమాస్తా పనికూడ చాలక శ్రాద్ధకర్మలుకూడ చేయిస్తున్నావటగా? వెళ్ళు. నీ చావు నువ్వు చావు! మళ్ళీ నాదగ్గరకు రాకు" అన్న చివరిమాటలు మాత్రం విన్పించాయి.

ఎవరా అనుకుంటూ నేను వెళ్ళాను. అతను రామనరసు. అతనికి బాగా కోపం వచ్చింది. కానీ తన ఆవేశాన్ని అణచుకుంటూ నవ్వాడు. తన్నలా తూలనాడిన శంకరనారాయణతో అవహేళనగా అన్నాడు, "నువ్వు చస్తే, నీ అంత్యక్రియలు కూడ నేనే చేయిస్తానులే!"అని.

ఆ మాటలతో తన బావగారు మండిపోయాడు. వాచ్‌మన్‌ని పిల్చి, 'ఆ మనిషిని మళ్ళా మన గుమ్మంలోకి రానివ్వ వద్ద'ని ఆదేశం జారీ చేశాడు. హేతువాదికంత కోపం రాకూడదు. ఆయన కెందుకంత కోపం వచ్చిందో తన కర్థం కాలేదు.

అతను వెళ్ళి పోయాక, "డబ్బు సాయం చెయ్యమని అడగటానికి వచ్చి ఉంటాడు. నీకు తెలుసుగా మీ బావగారి సంగతి, ఇలా ఆ వంకన అడుక్కోటానికి రావటం చూస్తే ఆయనకు మండుతుందని!" అని చెప్పింది చెల్లెలు మాణిక్యాంబ.

నేను ఆ సంఘటన గుర్తు చేసుకుంటుంటే, తనెందుకు శంకరనారాయణగారి కర్మ చెయ్యటానికి వచ్చాడో, ఆయన తనకు చేసినసాయమెలాంటిదో ప్రభుకు చెప్పసాగాడు రామనరుసు.

"మీ నాయన నా కెప్పటినుండో తెల్సు. ఒకసారి నేను ఆయన దగ్గరకు వెళ్ళాను డబ్బు సాయం చెయ్యవల్సిందని. అప్పుడు ఆయనో మాట అన్నారు, నన్ను తిడుతూ– నువ్వు వేదం, శాస్త్రాలు చదువుకున్నావు. పచారీ కొట్లో గుమాస్తా ఉద్యోగంలో పెద్ద సంపాదన ఉంటుందనా అటు వెళ్ళావు! శ్రాద్ధకర్మలుకూడ చేయిస్తున్నావంట! వెళ్ళవయ్యా వెళ్ళు! తనకుగాని పనిలో తిండి వెతుక్కునేవాళ్ళంటే నాకు మంట! నీ అవసరాలు నాకు అనవసరం. నీ చావు నువ్వు చావు! మళ్ళీ నాదగ్గరకు రాకు– అని. నాకప్పుడు డబ్బు చాల అవసరం. నా పెద్ద కొడుక్కు పెద్ద జబ్బు చేసింది. చావు బతుకుల్లో ఉన్నాడు. శంకరనారాయణగారు తప్పక సాయం చేస్తారని వచ్చాను. ఆయన చెయ్యలేదు. సమయానికి చేతిలో డబ్బు లేక నా కొడుకు ప్రాణం కాపాడుకోలేక పోయాను. అయితే, ఆయనన్న మాటలు నాకెంతో మేలు చేశాయి. నేను, ఆయన చెప్పినట్టే, చిన్నప్పుడు వేదాలు, శాస్త్రాలు క్షుణ్ణంగా చదువు కున్నాను. కొంతకాలం వేద సాహిత్యం చదువుకుంటూ వారణాసిలోకూడ ఉన్నాను. కొంత పెరిగి పెద్దయ్యాక నాకు వాటిల్లో నమ్మకం పోయింది. ఈ కాలంలో అవి ప్రాసంగికం కావని నాకనిపించింది. అందుకే, పిల్లలకు వేదం, శాస్త్రాలు నేర్పే నేను ఆ పని మానేశాను. 'అంధే నైవ నీయమానా యథాన్ధాః' అన్నట్లు నేనే గుడ్డివాడినీ, ఆ గుడ్డివాళ్ళకేం తోవ చూపుతాను! పైగా ఆ వృత్తి నాకు జీవనోపాధిని అందించలేదు. నేను భోజనం పెట్టి, ఇంట్లో ఉంచుకుని విద్యాబోధన చేస్తేనే విద్యార్థులు రావటం కష్టంగా ఉండేది. నాకంత స్తోమత లేక పోవటం ఒక కారణం. రెండో కారణం ఆ విద్య ఇప్పటి పరిస్థితులకు సరిపోదని నేను భావించటం....."

"అంత చదువూ చదవుకుని భౌతికవాదులయాయరన్న మాట!" అన్నాను.

అతని మాటలు వింటూంటే కొంత ఏహ్య భావం కలిగింది నాలో.

"తన పంటినొప్పిని గూర్చి ఒక తత్వవేత్తకున్న జ్ఞానానికీ, ఆ నొప్పికి చికిత్స చేసే దంతవైద్యుడి జ్ఞానానికీ తేడా ఉన్నది. మీ మాట కాదనటమెందుకు? అయుండొచ్చు. చార్వాకులకు ప్రత్యక్షమే ప్రమాణం కనుక కళ్ళకు కన్పించే వస్తువే, పదార్థమే వారికి సత్యం. ప్రపంచం కానీ, అందులో జరిగే సంఘటనలు కానీ అంతా యాదృచ్ఛికంగా జరిగేవే. అంతకుమించి ఏం లేదంటారు లోకాయతులు. ఈ యజ్ఞయాగాలను, కర్మకాండలను, శ్రాద్ధకర్మలను వేటినీ వారు నమ్మరు. జ్యోతిష్టోమంలో బలి ఇచ్చిన

జంతువు స్వర్గానికి పోతే, మీ నాయన్నే బలి ఇచ్చి వెంటనే స్వర్గానికి పంపొచ్చుగా అంటారు చార్వాకులు. శ్రాద్ధం పెట్టి పితరులకు భోజన సదుపాయం కలిగిస్తే, ప్రయాణీకులకు చద్దిమూటలు కట్టి ఇవ్వాల్సిన అవసరం ఉందా? మంత్రాలతో ఇక్కడినుండే వారున్న చోటికి భోజనం పంపేయొచ్చుగా అంటారు లోకాయతులు. నేను లోకాయతుడినా? 'కేవలాఘో భవతి కేవలాది' (ఋగ్వేదం) అంటే మరొకరి ధ్యాసలేకుండా, తినేవాడు పాపం సంచితం చేసుకునేవాడే! నేను కాదనను. 'యావజ్జీవేత్ సుఖం జీవేత్' అంటే మీకు లోకాయతమని పిస్తుంది...."

"లోకాయతుడంటే?" అడిగాను నేను. అతని మాటలు నాకు అర్థం కాలేదు.

"అంటే మీ అర్థంలో చార్వాకుడు! పాపం ధూర్జటి పశ్చాత్తాప పడ్డాడు, 'దేవునితోడ నేల చార్వాకమొనర్చితిన్' అంటూ. సరే, లోకాయతుడంటే నాస్తికుడు, భౌతికవాది లేక హేతువాది. నా బోటీ తిన తిండిలేనివాడు మన సంస్కృతిని కాపాడాలి. మన వేదవిజ్ఞానాన్ని పరిరక్షించాలి. వేరే బతుకు తెరువు చూసుకుంటే ఆ వ్యక్తి హేతువాది అవుతాడు... అదీ తిట్టో దీవనో నాకు తెలీదు! మీ బోటి పెద్దల్లో హేతువాది గొప్పవాడు. నా బోటివాడు హేతువాదయితే నికృష్టుడు...."

నేను అతని మాటలకేమీ జవాబు చెప్పలేదు. అతని మాటలు సమంజసంగానే ఉన్నాయి.

"సరే, నా సంగతి చెప్పుకుంటాను. మరే దారీ తెన్నూ లేక బతుకు గడపటానికి పచారీ కొట్లో గుమాస్తాగా చేరాను. అందువల్లా నా కడుపు నిండలేదు. బ్రాహ్మణార్థాలకూ వెళ్ళసాగాను. కొడుకు ప్రాణం ప్రమాదంలో పడితే తప్పక వచ్చాను. ఆయన తిట్టు నాకు ఉపకరించింది. అధ్యయన, అధ్యాపనాలు నాకు జీవనభృతి కల్పించలేక పోయాయి. అయితే, బ్రాహ్మణార్థాలకు దిగాక, జనాలకు పూజలు, వ్రతాలు, అపరకర్మల మీద నమ్మకం విపరీతంగా పెరిగిపోయిందని అర్థమైంది. సంస్కృతం బాగాతెలిసిన వాడిని. స్మార్తం నేర్చుకోటం నాకేమీ కష్టమనిపించలేదు. పౌరోహిత్యంలోకి దిగాను. బాగా డబ్బు సంపాదించ గలిగాను. వాటిల్లో విశ్వాసం ఉండి ఆ వృత్తిలోకి దిగినవాడిని కాదు. మీనాన్నగారు తిట్టిన తిట్టువల్లే నాకు దరిద్రం తీరింది. అది తిట్టు కాదు, దీవన! అందుకే, ఆయన అపరకర్మలకు నేను దక్షిణ స్వీకరించలేను. ఆయన చేసిన మేలుకు ఇలా బదులు తీర్చుకోవచ్చాను" అని చెప్పాడు రామనరసు.

"అంతేనా, మరేమయినా ఉందా, రామనరుసుగారూ?" అనడిగాను.

"అంతే, సన్నిహితుడిగా నాకు చేతనయింది చెయ్యటానికి వచ్చాను."

అతడి మాటలు సూటిగా ఉన్నాయి. మెరమెచ్చులకు చెప్పే మాటలుగా లేవు.

"నమ్మకం లేనివాడు చేయించే అపరం వల్ల మా నాయనకు ఉత్తమ గతులు కలుగుతయ్యా?" అడిగాడు ప్రభునారాయణ.

అతడు నవ్వాడు, "ఇక్కడ నా విశ్వాసాలకు ప్రాధాన్యం లేదు. కర్తకు విశ్వాసం ఉంటే చాలు" అని చెప్పాడు.

ఆగంతుకుడికేమి సమాధానం చెప్పాలా అని వాడు ఆలోచిస్తున్న తరుణంలో, నేను "సరే, చెయ్యండి" అన్నాను.

"నిన్న కదా పోయింది. ఇంకా రావల్సిన వాళ్ళెవరయినా ఉన్నారా?" అడిగాడు రామనరసు.

"నాన్న కర్మ తమ్ముడు బదరీనారాయణ కదా చెయ్యాల్సింది. అమెరికాలో ఉన్న వాడికి ఫోను చేస్తే, 'నాకిప్పుడుకుదిరేట్టులేదు బ్రదర్! నువ్వు జరిపించెయ్యి. మనిషి పోయాక ఎవరు కర్మ జరిపిస్తే మాత్రమేం?' అన్నాడు వాడు. 'అదేమిటిరా, అలా అంటావు? కన్నతండ్రి పోయినప్పుడు రాకపోతే ఎప్పుడు వచ్చేట్టు?' అని కూడ అన్నాను. నాకు కష్టమేసిందనుకో, మామయ్యా, వాడి తీరుకు! 'కుదరదులే! ఇప్పుడు తీరికలేదు, తరవాత మాట్లాడతాను' అని ఫోను పెట్టేశాడు తమ్ముడు!" అని ప్రభునారాయణ నాకు ఫిర్యాదు చేశాడు, తప్పదన్నట్లు.

"కర్మ చేయాల్సింది జ్యేష్ఠ పుత్రుడు కదా?" అన్నాడు పురోహితుడు.

"మా ఇంట్లో ఆచారం ప్రకారం చిన్నవాడే చెయ్యాలిట! మా నాన్నగారు చెప్పారు."

"అవును. మా చెల్లెలు పోయినప్పుడు కూడ చిన్నవాడే చేశాడు" అన్నాను నేను ఆ ప్రసంగానికి అడ్డుకట్ట వేస్తూ.

తల్లి మాణిక్యాంబను తలచుకున్నప్పుడు ప్రభు కళ్ళు నీళ్ళతో నిండిపోవటం కన్పించింది నాకు.

"మీకు తెలీంది ఏమీ లేదు. వీడు మా బావగారికి పెంపుడు కొడుకు. సొంత కొడుకు కర్మ చేస్తే ఉత్తమ గతులు కలుగుతాయనుకున్నాడేమో ఆయన" అన్నాను నేను.

"ఆ మాటనకు మామయ్యా! నాన్న హేతువాది. తనకు కర్మలు చెయ్యమనికూడ నాకెప్పుడు చెప్పలేదు. అమ్మకు నమ్మకం కనుక, మనింటి సంప్రదాయం ప్రకారం తమ్ముడిచేత చేయించాడు. ఆయన నన్నెప్పుడూ వేరుగా చూడలేదు" అన్నాడు ప్రభు.

ఆ మాటలు పూర్తిగా నిజమనీ చెప్పలేను, అబద్ధమనీ చెప్పలేను.

నవ్వాడు రామనరుసు. "దత్త స్వీకారమయ్యాక అతడు ఆయనకు సొంత కొడుకుతో సమానమే. వివక్ష పనికి రాదు."

శంకరనారాయణ, మాణిక్యాంబలు మా బావగారు, చెల్లెలు. ఆ దంపతులు పెళ్ళయి పదేళ్లయినా నిస్సంతుగానే గడిపారు. ఒకసారి బంధువుల ఇంటికి పెళ్ళికి వెళ్ళినప్పుడు, అక్కడ ఓ కుర్రవాడిని వాళ్ళు చూడటం తటస్థించింది. వాడిని చూసి మాణిక్యాంబ ముచ్చటపడి పోయింది. చెల్లెలు మాణిక్యాంబ ఎత్తుకుని ముద్దు పెట్టుకున్నప్పుడు వాడు కొత్తదనం పోలేదు. తన్ను ఎత్తుకున్న ఆమెని చూసి నవ్వాడు. పిల్లలకోసం మొహంవాచిన ఆమె పిల్లవాడి మోహంలో పడిపోయింది.

"పిల్ల వాడు ఎంత ముద్దొస్తున్నాడో? మనం వీడిని దత్తత తీసుకోవచ్చుగా? పెళ్ళికి వచ్చారంటే మన వాళ్ళ పిల్లవాడే అయి ఉంటాడు. మీరేమంటారు?" అంది భర్తతో.

"అవును, ఎందుకు తీసుకోకూడదూ? పిల్లవాడు కూడ చూడటానికి బొద్దుగా ముద్దుగా ఉన్నాడు. ఇంకా బాగా ఊహ కూడా రాలేదు. మనం పెంచుకోటానికి తగిన పిల్లవాడే!" అన్నాడు శంకరనారాయణ.

విచారణకు తననే పంపారు. పిల్లవాడి తల్లిదండ్రులు సాటి కులంవారే కానీ బీద కుటుంబీకులు. వారి నలుగురు సంతానంలో వీడు కడపటివాడు. అప్పటికి వాడు రెండేళ్ళవాడు. అప్పటి పేరు వెంకటేశ్వర్లు. కన్న తల్లిదండ్రులతో మాటలయ్యాయి. వాళ్ళు పిల్లవాడిని శంకరనారాయణ దంపతులకు దత్తు ఇవ్వ అంగీకరించారు. తమ దగ్గర పెరిగితే పిల్లవాడు బావుకునేదేమీ లేదు. శంకరనారాయణ ధనవంతుడు. కనీసం పిల్లవాడి బతుకయినా బాగుపడుతుందని అతని కన్న తండ్రి అంగీకరించాడు. తల్లి కొడుకును దత్తునివ్వ ఓ పట్టాన ఒప్పుకో లేదు. భర్త చెప్పిన హేతువులు ఆమెను తేలిగ్గా సమాధాన పర్చలేక పోయాయి. చివరకు భర్త కసిరి, తిట్టి ఆమె అంగీకారం పొందాల్సి వచ్చింది. అప్పుడు తను అక్కడే ఉన్నాడు. అతడి మాటలు చాల యుక్తియుక్తంగా ఉన్నాయి.

భార్య మాణిక్యాంబ పిల్లవాడిని దత్తు తీసుకుందామని ప్రతిపాదించినప్పుడు- నిజానికి అలాంటి ఆలోచన ఆ దంపతులెప్పుడూ చేయనప్పటికీ- శంకర నారాయణ కాదనలేదు. ఆమె ఆలోచనలోని హేతువును అతను కాదనలేదు.

తన భర్త మేథా సంపత్తి పట్ల ఆమెకెంతో గర్వం. ప్రతి విషయాన్నీ తరచి చూసిగానీ అతడు నిర్ణయం తీసుకోడు. ఓ సారి నిర్ణయం తీసుకున్నాక దాన్నుండి వెనుదిరగటమంటూ ఉండదు. నిజానికి అతడు వ్యాపారంలో పాటించే సూత్రమదే. ఎలాంటి ఆవేశకావేశాలకూ లోనుకాకుండా బాగా ఆలోచించి నిర్ణయం తీసుకుంటాడని అతనికి బిజినెస్ సర్కిల్‌లో

పేరు. పిల్లవాడిని దత్తు తీసుకునేటప్పుడు పిల్లవాడి కన్న తల్లిదండ్రులకు భారీగానే ముట్ట చెప్పాడు. పాతికేళ్ళ క్రితం యాభైవేలంటే తక్కువ మొత్తం కాదు. కన్న తండ్రి శంకరనారాయణ అంత భారీగా ముట్ట చెప్తాడని భావించలేదు. ఆ డబ్బుతో ఎదిగొచ్చిన తన ఇద్దరు కూతుళ్ళకు మంచి సంబంధాలే చూసి పెళ్ళి చేయ గలిగాడతను. ఆ తర్వాత అతని బతుకు ఎప్పటిలాగానే అధ్వాన్నంగా తయారయింది.

దత్తస్వీకార కార్యక్రమమయ్యాక, శంకర నారాయణ పిల్లవాడి కన్న తండ్రిని పక్కకు పిల్చి చెప్పాడు:

"నేను ఏ విషయాల్లోనూ మొహమాటం పెట్టుకునే మనిషిని కాను. తరవాత మనమలా అనుకోలేదుగా అని మీరనవచ్చు. కనుకనే ముందుగా చెప్తున్నాను. ఇంక పిల్లవాడు మా పిల్లవాడు. వాడిని గురించి మీరు మర్చి పోవటం మంచిది. మేం కన్నవారం కదా అంటూ మీరు మా ఇంటికి రాకపోకలు సాగిద్దామంటే కుదరదు. అందుకే మీకు భారీ మొత్తంలో ఫైనల్ సెటిల్‌మెంటు క్రింద ఇస్తున్నాను. పిల్లవాడు మేం కన్నవాడు కాదన్న భావన వాడిలో మీరేమాత్రం కలిగించ ప్రయత్నించినా నేను సహించలేను. అది గుర్తుంచుకోండి."

ఇప్పుడు పిల్లవాడి పేరు ప్రభునారాయణగా మార్చారు. ఆ తర్వాత శంకరనారాయణ తగిన జాగ్రత్తలు కూడ తీసుకున్నాడు. చుట్టపక్కాల్లో శుభ, అశుభ కార్యాలేమన్నా జరిగినప్పుడు పిల్లవాడి కన్న తండ్రి కుటుంబం వస్తుందని భావిస్తే అతడు అలాంటి వాటికి హాజరయ్యేవాడు కాదు. బిజినెస్ పనులనేవాడు. కాదనటానికి మాణిక్యాంబకే కారణమూ కన్పించేది కాదు.

నేను కూడ శంకరనారాయణను తప్పు పట్టలేను. ప్రభును తన స్వంత కొడుకుగానే స్వీకరించ ప్రయత్నించాడతను.అయితే, మాణిక్యాంబ ఎలాంటి సంకోచాలూ లేకుండా పిల్లవాడిని ఒడిలోకి తీసుకున్నట్టు అతడు చేయలేక పోయేవాడని నా కనిపించేది. పసివాడిని ఎత్తుకోవాలన్నా అతనికి మనస్కరించేది కాదు. వాడిని ఎప్పుడు ఎత్తుకుందామని మనసు వచ్చినా అతడికి వాడి కన్న తండ్రి దరిద్రపు ముఖం గుర్తుకు వచ్చేదనుకుంటాను. సగం నెరిసిన పది రోజుల గడ్డంతో, మాసిపోయిన చొక్కా ధోవతి కట్టుకునుండే అతని రూపమే అతని కళ్ళముందు ఆడేది. చొక్కాజేబు ఓపక్కన కుట్లూడి, వేలాడుతుంటే ఆ దరిద్రాన్ని భరించలేక పోయేవాడు. ఒకసారి మాటల సందర్భంలో నాతోనే ఆ మాటలన్నాడు.

"నిజమే, తగిన రాబడి లేదు. అది నేను అర్థం చేసుకో గలను. చొక్కాజేబు కుట్లూడితే రెండు కుట్లు వేసుకోవచ్చునే? అదేం ఖర్చుతో కూడుకున్న పని కాదు కదా? సగం దరిద్రం మనం స్వయంగా తెచ్చుకుంటాం" అని.

దుర్భర పరిస్థితిలో ఏ చిన్న పని చేయాలన్నా మనఃస్థితి సహకరించదని అతనికి తెలియదు అని అప్పుడనుకున్నాను.

"పోన్లెండి, ఆయన బాధలేమిటో మనకు తెల్సా? చేతనయిన సాయం మనం చేద్దాం. బీదవారికి సాయ పడితే ఆ దరిద్ర నారాయణుడు సంతోషిస్తాడు" అన్నది తన చెల్లెలు మాణిక్యాంబ.

"బీద వాళ్లెంతమంది లేరు, ఈ ప్రపంచంలో! అందరికీ మనం సాయం చెయ్యగలమా?"

"మన ప్రభు కన్న తండ్రి కదండీ! మనకూ కొంత బాధ్యత లేక పోలేదు."

"ఇప్పుడంటే అన్నావు కానీ, మళ్ళా ఆ మాటెప్పుడూ బయటకు రాకూడదు. పిల్లవాడికి మనం కన్న తల్లిదండ్రులం కాదని తెలియాల్సిన అవసరం లేదు."

అతడి ఆలోచన నిజమేననిపించింది మాణిక్యాంబకు, నాకు కూడ.

అందరూ శంకరనారాయణుని హేతువాదని మెచ్చుకుంటుంటారు. కానీ దగ్గరున్నవాడికి తెలుస్తుంది ఆంతర్యం. వాడి కన్న తండ్రి కనకే అసలా వ్యక్తికి సాయం చెయ్యకూడదు. తనలాంటి ఆగర్భ శ్రీమంతుడు నిస్సంతుగా ఉండగా, ఆ ఆగర్భదరిద్రుడు తన భార్య దృష్టిని ఆకర్షించ గలిగే కొడుకును కనగలగటం అతనికి ఈర్ష్యా హేతువయిందనుకుంటాను. ఆపైన, కన్నవాళ్ళమంటూ దరిద్రులు నిత్యం తన ఇంటికి రాకపోకలు సాగించటం అతనికి భరించరాని విషయం. దరిద్రుల పట్ల అతడికి అకారణ కోపం. ఆ దరిద్రుడి కొడుకయిన కారణానే అతడు ప్రభును వీలయినంత దూరంగా వుంచే ప్రయత్నం చేసేవాడని నేననుకునేవాడిని. నిజానికి ఇలాంటి భావాలు తనకున్నాయని కూడ అతనికి తెలియదేమో! అయితే, అతనికి బదరీ నారాయణ పుట్టాక ఆ భావన పోను పోను స్పష్టమవసాగింది నాకు. ప్రభును ఒడిలోకి తీసుకున్న అదృష్టం వల్లే తన కడుపు పండిందని మాణిక్యాంబ భావించేది. అయితే, ఆ అదృష్టాన్ని ప్రభుకు కట్టబెట్టటానికి శంకరనారాయణ అంగీకరించ లేదు. అలా తనకు సొంత కొడుకు పుట్టినప్పటి నుండి శంకరనారాయణ ప్రభు నుండి దూరంగా జరగటం నాకు అస్పష్టంగా అనుభూత మయింది.

చెల్లెలు మాణిక్యాంబతో కూడ ఒకసారి తనన్నాడు, "ఎలా అయినా సొంత బిడ్డ సొంత బిడ్డే! దత్తు దత్తే!" అని.

"అదేమిటి అన్నయ్యా? మీ బావగారు అలాంటి భేదాలు పాటించే మనిషా? 'మన ఇంటికొచ్చిన పిల్లాడు మన పిల్లాడే! పరాయి వాడెందుకవుతాడు' అని అన్నారు" అంది.

నేను అప్పటికేం మాట్లాడలేదుకానీ, ఎప్పుడు చెల్లెలింటికొచ్చినా ఆ భేదం నేను గమనించక పోలేదు. తన స్వంత కొడుకుని ఎత్తుకుని ముద్దాడటంలో తన బావ కెలాంటి సంకోచాలూ ఉండేవి కావు. 'వాడు తన రక్తంలో రక్తం!' అయితే, శంకరనారాయణ ఈ మాటలనెప్పుడూ బయటకు చెప్పేవాడు కాదు. హేతుబద్ధంగా ఆలోచించే ఏ వ్యక్తి కయినా అతడు కొడుకులమధ్య విచక్షణ చూపగలడన్న భావనే కలుగదు. అసలు తన చెల్లెలు మాణిక్యాంబే గుర్తించలేదు.

పిల్లవాడు వచ్చాక తమకు బాగా కలిసి వచ్చిందని భావించింది మాణిక్యాంబ. అసలు సంతానమే కలుగదని భావించిన తనకు, ప్రభును ఒడిలోకి తీసుకున్నాక, రెండేళ్ళలోపే, తన కడుపు పండటంతో ప్రభు పట్ల ఆమె వాత్సల్యం ఇనుమడించింది. ఆమె కొడుకుల మధ్య విచక్షణ చూప లేదు. శంకరనారాయణ వ్యాపారం కూడ ఇదివరకటి కంటే బాగా పుంజుకుంది. ఆమాట భార్య అంటే అతడు కొట్టి పారేసేవాడు.

"'కృషితో నాస్తి దుర్భిక్షం.' నేను క్షణం విశ్రాంతి తీసుకోకుండా శ్రమిస్తాను. నా కృషిని, శ్రమను మరే దానికో కట్టబెట్టకు" అనేవాడతను. అతని మాటల్లో నిజం లేదని అనలేదు మాణిక్యాంబ.

ప్రభును పెద్ద చదువు చదివించాడు శంకరనారాయణ. మాణిక్యాంబ కొడుకు డాక్టరు కోర్సు చెయ్యాలని ముచ్చట పడింది. అతడు కాదనలేదు. అతనికి కావల్సిన వాతావరణం కల్పించాడు. డబ్బుకే మాత్రం వెనుకాడలేదు. తల్లి నిరంతర ప్రోత్సాహం. తండ్రి అజమాయిషీ వల్ల అతడూ చదువులో పైకెక్కి వచ్చాడు. కొడుకు చదువులో అభివృద్ధి సాధించటం శంకరనారాయణకు గర్వ కారణమే అయింది. ఎంబిబిఎస్ డిస్టింక్షన్‌లో పాసయాడు. ఎం ఎస్(జనరల్ సర్జరీ) లో సీటు సంపాదించాడతను. పెళ్ళి సంబంధాలు వస్తున్నాయి. ఇంకా పెళ్ళి వాయిదా వెయ్యాటానికి కారణమేం కన్పించలేదు. పెద్ద సంబంధం కుదిరింది. మంత్రిగారి కూతురు. ఎం.ఏ పాసయింది, అందంగా ఉంటుంది. కట్నం పేరు చెప్పకపోయినా ఆయన భారీగానే ముట్ట చెప్తాడు. ప్రభునారాయణకు కూడ పిల్ల నచ్చింది. పెళ్ళయాక, మంత్రిగారి పలుకుబడో, అతని ప్రతిభో కానీ అతనికి ఆమెరికా వెళ్ళే ఛాన్సు వచ్చింది. తండ్రి అతను ఆమెరికా వెళ్ళటానికి అంతగా అభ్యంతరం పెట్టలేదు. కానీ మాణిక్యాంబ మాత్రం అతను తమను వదలి వెళ్ళటానికి ససేమిరా అంగీకరించలేదు.

"పోనీ రాదా, పిల్లవాడి అభివృద్ధిలో మనం అడ్డంకిగా మారటమెందుకూ?" అన్నాడు కూడ శంకరనానాయణ.

"మనకా వయసు వస్తున్నది. నన్ను ఈ గుండె జబ్బు ఎప్పుడు తీసుకు వెళ్తుందో చెప్పలేం? ఎప్పటికప్పుడు బయట పెట్టటంలాగా ఉంది పరిస్థితి. పెద్ద బిడ్డ దూరంగా ఉంటే, ప్రాణంపోయే సమయంలో గొంతులో గుక్కెడు గంగనీరు ఎవరు పోస్తారు!" అంది మాణిక్యాంబ.

"అన్నీ విడ్డూరంగా మాట్లాడతావు! ఇప్పుడు వైద్యం ఎంతగా అభివృద్ధి చెందిందనుకుంటున్నావు. ఒకసారో, రెండుసార్లో అటాక్ వచ్చినంత మాత్రాన ప్రమాదమేమీ లేదు. పోనీ, నువ్వన్నట్టు అంత ముంచుకు వచ్చినా, ఆ గుక్కెడు గంగనీరు పోయటానికీ బదరీ లేడూ?" అన్నాడు శంకరనారాయణ.

"పెద్దకొడుకు పోస్తే ఉత్తమ గతులు కలుగుతాయట!"

"ఓ విధంగా బదరీనే మన పెద్ద కొడుకు!"

"మీ మనసులో ఉన్నమాటేనా అది? ఇంకెప్పటికీ అలాంటి మాటలనొద్దు."

"ఛ, ఛ! నీకు నా సంగతి తెలీదూ? నేను హేతుబద్ధంగా ఆలోచించే మనిషిని. నాకు వాళ్ళిద్దరిలో తేడాలేదు."

తల్లిససేమిరా అంగీకరించకపోవటంతో, ప్రభునారాయణ అమెరికా వెళ్ళటం మానుకున్నాడు. అయితే, అతడు అందుకు బాధ పడింది లేదు. రెండో కొడుకు బదరీనారాయణ అమెరికాలో ఎమ్మెస్ చేశాక, అక్కడే ఉద్యోగం చూసుకోటాన్ని శంకరనారాయణ హర్షించలేక పోయాడు. ఇండియాకు తిరిగి వచ్చి, తన బిజినెస్‌లో చేరతాడని ఆశించాడు. ప్రభును అతనెప్పుడూ బిజినెస్‌లో చేరమని ప్రోత్సహించ లేదు. పైగా అతని చదువుకూడ అందుకు అనువైనది కాదు. అయితే, బదరీ తండ్రిమాట వినలేదు. పెళ్ళి కూడ అమెరికాలో తనకు నచ్చిన తెలుగమ్మాయినే చేసుకున్నాడు. ఇష్టం లేకపోయినా తల్లిదండ్రులకు అంగీకరించక తప్పలేదు.

చూసేవాళ్ళు శంకరనారాయణ కొడుకుల మధ్య వివక్ష చూపుతాడని గమనించలేరు. అలాంటి దృష్టికి గురయ్యే వ్యక్తులకు ఆ భావన అజ్ఞాతంగానే అనుభూత మవుతుందనుకుంటాను. ప్రభుకు కూడ తండ్రి తననుండి దూరం పాటిస్తాడని అజ్ఞాతంగా అవగాహన కలిగిందనే నా అనుమానం. అది స్పష్టంగా చెప్పటం కష్టం. అయితే, తన తల్లి మాణిక్యాంబ మరణించినప్పుడు, తను ఆమెకు అంత్యక్రియలు నిర్వహించకూడదని తండ్రి అభ్యంతర పెట్టినప్పుడు, ఆ వివక్ష అతనికీ, నాకూ స్పష్టంగా అవగాహన అయింది.

"మన ఇళ్ళల్లో చిన్న కొడుకు తల్లిదండ్రులకు అంత్యక్రియలు నిర్వహించటం ఆచారం. కనుక వాడే చేస్తాడు" అన్నాడు తండ్రి.

ప్రభునారాయణ నావంక చూశాడు.

"అవును మరి! మీ నాన్నకు తెలియనిదేముందీ? నువ్వు బాధ పడకు" అన్నాను. నేను.

ఇంటి ఆచారం అనేది వంక మాత్రమే. అలాంటి ఆచారం ఆ ఇంట్లో ఉందనికూడ నాకు తెలియదు. అంత్యక్రియల్లో తన పాత్ర లేకుండా చెయ్యటమే ఆయన అభిప్రాయమని అతని కవగతమయింది. కానీ, ప్రభు కాదనలేదు. తన గుండెలో ఏమనుకున్నాడో తెలియదు.

ఆలోచనలో పడి పోయిన నన్ను తట్టిలేపుతున్నట్టు, "ఏదో ఆలోచనలో పడ్డట్టున్నారు. మీ చెల్లెలు గుర్తుకొచ్చారో, మరి బావగారో? 'జాతస్యహి మరణం ధృవమ'న్నారు. మీరు మనసు ఉగ్గబట్టుకుని పిల్లవాడికి కర్తవ్య బోధ చెయ్యాలి" అన్నాడు రామనరసు.

"మరి చిన్నహాడు రానప్పుడు మనం చేయగలిగింది మాత్ర మేముంది? ప్రభువే కర్మ చేస్తాడు" అన్నాను.

"కానీ, నాన్నకు వాడు చేస్తేనే ఆత్మశాంతి కలుగుతుంది. అది మన ఇంటి ఆచారం కూడా!" అన్నాడు ప్రభునారాయణ.

"మీరే మంటారు, రామనరసుగారూ?" అనడిగాను.

"శాస్త్ర ప్రకారం పెద్దకొడుకే పితృకార్యాలకు అర్హుడు. దత్త పుత్రుడన్న అవరోధం ఉండదు" అన్నాడు రామనరసు.

"నేను చేస్తే ఆయనకు ఆత్మశాంతి ఉండదు, మామయ్యా! ఆపైన నాకు ఈ కర్మకాండలపై నమ్మకం లేదు. నమ్మకం లేనప్పుడు లోకుల కోసం చెయ్యాల్సిన పని లేదని బ్రహ్మగారు చెప్పారు" అన్నాడు ప్రభునారాయణ.

"నేను అట్లా చెప్పానా? మంచిదే, నమ్మకం లేకపోతే చెయ్యకు" అన్నాడు రామనరుసు.

"మీ నాన్నలాగా నువ్వూ మంచి హేతువాదివేరా?" అన్నాను నిష్ఠూరంగా. నిజం చెప్పొద్దూ, నాకు నిజంగానే కష్టమేసింది. ఇద్దరు కొడుకులు ఉండి బావగారికి ఉత్తరక్రియలు సక్రమంగా జరగకపోతే బంధువర్గం నన్ను తప్పుపడుతుంది.

అలాంటి భావం నా మేనల్లుడి మనసులో కలిగించిన రామనరుసు అంటేనూ నాకు కోపం వచ్చింది. కోపాన్ని అణచుకుంటూ, "చాల పెద్ద చిక్కు తెచ్చిపెట్టారండీ రామనరుసుగారూ! మా బావగారిమీద ఇలా కసి తీర్చుకుంటున్నారా? తండ్రి పోయాక

ఉత్తరక్రియలు చెయ్యవద్దని కొడుక్కి బోధనలు చేస్తారా మీరు? ఇప్పుడు గతేమిటి?" అన్నాను దురుసుగానే.

"కర్తవ్యం చిన్నకొడుకు మీద వేసి కార్యక్రమం జరిపించెయ్యవచ్చు. మీ బావగారి కోరికపైనే అలా చేయిస్తున్నామని చెప్పండి. బంధు వర్గంలో మిమ్మల్ని తప్పు పట్టేవాళ్ళెవరూ ఉండరు. పెద్దబాబుకు నమ్మకంలేదు కనుక, కర్మ చెయ్యటానికి ఎవరయినా బ్రాహ్మడిని ఏర్పాటు చేయిద్దాం" అన్నాడు రామనరసు.

అలాగే చెయ్యటానికి అంగీకారం కుదిరింది.

శంకరనారాయణ అంత్యక్రియలు ఘనంగా నిర్వహించటం జరిగింది. ఏ విషయంలోనూ లోటు జరగలేదు. అన్ని కర్మలూ శాస్త్రవిధేయంగా నిర్వర్తింప చేశాడు రామనరసు. చివరకు, వెళ్ళబోయే ముందు ప్రభునారాయణ ఆయనకు భారీగా దక్షిణ ఇవ్వబోతే, ఆయన పుచ్చుకోలేదు.

"వద్దు, మీ నాన్న బతికున్నప్పుడు నాకు మహోపకారం చేసిన వ్యక్తి. ఆయన అపరకర్మలు పైస ఆశించకుండా నిర్వహించి ఇలా నా కృతజ్ఞతలు తెలియబర్చు కుంటున్నాను. డబ్బు తీసుకుని ఆ స్మృతిని మలిన పర్చ లేను. నిజానికి బతికున్నప్పుడు ఆయన ఇంతకు ఇబ్బడి ముబ్బడిగా ముట్ట చెప్పాడు" అని వెళ్ళి పోసాగాడు.

ప్రభునారాయణ నిస్సహాయంగా నిలబడి పోయాడు.

రామనరసు వెళ్తుంటే అతణ్ణి ఇంటి గేటుదాకా అనుసరించాను.

పక్కన నడుస్తూ, "నాకు తెల్సి మీకు మా బావగారు ఏం చేసినట్టు లేదే! మీరొకసారి వచ్చినప్పుడు, నేను మా బావగారి ఇంట్లోనే ఉన్నాను. ఆయన మిమ్మల్ని తిట్టి, తన్ను యాచిస్తూ తన ఇంటికి రావద్దని చెప్పారు. మరి, ఆయన మీకేదో మహోపకారం చేశారని చెప్తున్నారు! మీరు కోపంలో మా బావగారితో 'నువ్వు చస్తే, నీ అంత్యక్రియలు కూడ నేనే చేయిస్తాన'ని అన్నట్టు నాకు గుర్తు. నిజం చెప్పండి. అందుకే వచ్చారా?" అన్నాడు రామమూర్తి.

"లేదు. క్షణికా వేశంలో అన్న మాట నిజమే! అందుకు కాదు వచ్చింది. ప్రభు తండ్రిలాగే కపట హేతువాదేమో చూద్దామనివచ్చాను. డాక్టరు! అతడిది భౌతిక జీవనానికి ప్రాధాన్యమిచ్చే వృత్తి. విశ్వాసం ఉండి ఉత్తరక్రియలు చేస్తాడో, లోకం కోసం చేస్తాడో చూద్దామని వచ్చాను. తనకు నమ్మకం లేకపోయినా తనకు ఉత్తరగతులు కలుగుతాయని తండ్రికి నమ్మకం ఉంటే, తన విశ్వాసాన్ని పక్కనబెట్టి తన కర్తవ్యాన్ని నిర్వహించి ఉండేవాడు.

పను చేస్తే ఉత్తరగతులు కలుగుతాయని తండ్రికి నమ్మకం లేదు కనుక కర్మ చెయ్యటానికి నిరాకరించాడు అతడు. అందుకు నాకెంతో గర్వంగా ఉంది" అని చెప్పాడు రామనరుసు.

"మంచి హేతువాదులే లెండి, వెళ్ళి రండి" అన్నాను.

ఇప్పుడు 'హేతువాది' అనటంలో అవహేళన లేదు, తిరస్కారం లేదు.

అంతలో గేటు దగ్గరకు వచ్చాడు ప్రభునారాయణ.

"రామనరుసుగారు గొప్ప మనిషే. ఐ హావ్ మెట ఎ మాన్ హు లివ్స్ ఏన్ ఆనెస్ట్ లైఫ్. ఐయామ్ హాపీ అబౌటిట్" అన్నాడు, తలవంచుకుని వెళ్ళిపోతున్న రామనరసు వంక చూస్తూ.

"మరి హేతువాది కదా?"

"ఎవరు హేతువాది?"

"మీ నాయన!"

"పోన్లే, మామయ్యా! పోయిన మనిషిని గురించి చెడుగా చెప్పుకోటమెందుకూ?"

"రామనరుసు ఎవరనుకుంటున్నావు? ఆయన నీ కన్నతండ్రి!"

"నిజమా?" అన్నాడు నమ్మలేనట్టు ప్రభునారాయణ.

"ఆయన జీన్స్‌కు నువ్వు వారసుడైనంత నిజం!"

**నవ్య వీక్లీ** దీపావళి ప్రత్యేక సంచిక 2012.